క్లుప్తంగా

యువ ఓటర్లలో చైతన్యం



జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి రాజేష్ జోగ్‌పాల్, కలెక్టర్ నివాస్‌లకు పుష్పగుచ్ఛం అందించిన పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు

బోట్‌క్లబ్: కాకినాడ జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ప్రశాంత వాతావరణం ఉండడంతో ఓటింగ్ శాతం పెరిగిందని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ జె నివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపడం, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చేపట్టిన శాంతి భద్రతల నిర్వహణతో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. కాకినాడ సిటీలో 72 శాతం, రూరల్‌లో 73 శాతం జిల్లాలో 75 శాతం పోలింగ్ జరగడం అత్యంత అభినందనీయమన్నారు. జేఎన్‌టీయూ లైబ్రరీ హాలులో ఎన్నికల ప్రత్యేక అధికారి రాజేష్ జోగ్‌పాల్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్‌లకు మంగళవారం పౌర కన్వీనర్ ప్రముఖ సామాజికవేత్త దూసర్ల పూడి రమణరాజు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

ఘనంగా గురుపూజోత్సవం

బోట్‌క్లబ్: ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ 29వ ఆశ్రమ స్వీకారోత్సవ (పీఠారోహణ) సందర్భంగా బెంగళూరు జయతీర్థ విద్యాపీఠ పూర్వ విద్యార్థి యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక గొడారిగుంటలోని రమాసహిత సత్యదేవ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యాత్మ తీర్థ స్వామీజీ స్వీయ పర్యవేక్షణలో దేశమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించడంలో చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఏటా విద్యార్థులను సుధా పండితులుగా తీర్చిదిద్ది సమాజానికి అందిస్తున్న గొప్ప వ్యక్తిగా కొనియాడారు. మధ్వాచార్యుల నుంచి సత్యప్రమోదుల తీర్థుల వరకు ఉన్న స్వామీజీల మహిమలతో పాటు ఇతర మఠ విశేషాలను ప్రవచన రూపంలో సత్యాత్మ తీర్థ స్వామీజీ అందిస్తున్న ఆధ్యాత్మిక సంపద ఎంతో విలువైనదిగా పేర్కొన్నారు. ఈ ప్రాంత మధ్వ గృహస్తులకు స్వామీజీ ఆశీస్సులు నిరంతరం కలగాలన్న ఆశయంతో గురుపూజోత్సవంతో పాటు అనేక కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తున్నామన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీలో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ప్రసూన తదితరులు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్ వీవీజీ కృష్ణమూర్తి జ్ఞాపకార్థం భార్య మీనాక్షి ఆర్థిక సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, శ్రీదేవి రెడ్డి, శ్రీవాణి, నాగిరెడ్డి లక్ష్మి, సునీత, చల్లా విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు సేవలు అందించేందుకు పలువురు భక్తులు బుధవారం గోవింద మాలధారణ చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజు సుప్రభాత సేవ, తిరువారాధన, బాలభోగం, తీర్థ ప్రసాద గోష్టి, ద్వార తోరణపూజ, మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, దర్శనాలు, అర్చనలు, పవళింపు సేవలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యక్రమాలు ఇవీ

16న ఉత్సవ ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం), విష్వక్సేన ఆరాధన, పల్లకీ సేవ జరుగుతుంది. 17న ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, మండలారాధన. అగ్ని ప్రతిష్ఠ, భేరి పూజ, వాహన సేవలు, 18న సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఆలయం చుట్టూ త్రీ ప్రదక్షణ, శ్రీవారికి సహస్ర దీపాలంకార సేవ, భక్తుల స్వహస్తాలతో హారతి సమర్పణ, శేష వాహన సేవ నిర్వహిస్తారు. 19న శ్రీకృష్ణ గోపికా పూజ, ఎదురుకోలు ఉత్సవం, రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరగనుంది. 20న లక్ష్మీనారాయణ వ్రతం, శ్రీకృష్ణ తులాభారం, 21న సుదర్శన హోమం, సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, హిందూస్థానీ భజనలు ఏర్పాటు చేశారు. 22న శ్రీలక్ష్మీ నారసింహ హోమం, గరుడ వాహన సేవ, మృగయోత్సవం, రామాలయం వరకూ తిరువీధి దొంగల దీపోత్సవం, 23వ మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవ వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, శ్రీపుష్ప యాగం, మహదాశీర్వచనం, ఋత్విక్సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

మహిళలే నిర్ణేతలు

- ఓటరు తీర్పు భద్రం
- కాకినాడ రూరల్‌లో 74.94 శాతం పోలింగ్
- మొత్తం 2,69,330 ఓట్లకు 2,01,833 ఓట్లు నమోదు
- పథకాలే గెలిపిస్తాయని వైఎస్సార్ సీపీ ధీమా
- పోలింగ్ సరళిపై గ్రామాల్లో చర్చోపచర్చలు



స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తుగా ఉన్న పోలీసులు



కాకినాడ రూరల్ నియోజకవర్గ బ్యాలెట్ బ్యాక్స్‌లు భద్రపరిచిన కాకినాడ జేఎన్‌టీయూకేలోని మెకానికల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్ గదికి సీల్ వేస్తున్న ఈఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికలు – 2024 బరిలోని అభ్యర్థుల భవితవ్యం తేల్చేందుకు ఓటరు మహాశయుడు తీర్పును ఇచ్చాడు. ఇక ఫలితాల కోసం అభ్యర్థులు వేయి కళ్లతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. భారీగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలిరావడంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. రానున్న ఐదేళ్ల పాటు పాలించే ప్రభుత్వం, పాలకులను ఓటు అనే ఆయుధంతో ఎన్నుకునేందుకు బారులు తీరిన క్యూ లైన్లను సైతం లెక్క చేయకుండా వేచి ఉన్నారు. కొన్ని చోట్ల రాత్రి 11 గంటలు దాటే వరకు పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 2,69,330 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధికంగా మహిళలు 1,35,847 మంది, పురుషులు 1,33,475 మంది, ఇతరులు 8మంది ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో కాకినాడ రూరల్, కరప మండలాలతో పాటు అర్బన్‌లోని 8 డివిజన్లు ఉన్నాయి. మొత్తం 264 కేంద్రాలలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 74.94 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 2,01,833 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు అత్యధికంగా 1,01,558 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. పురుషులు 1,00,270 మంది, ఇతరులు ఐదుగురు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ ముగియడంతో కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ పర్యవేక్షణలో జేఎన్‌టీయూకే క్యాంపస్‌లోని మెకానికల్ ఇంజినీరింగ్ పీజీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచారు. అభ్యర్థులు, వారి తరఫున వారి సమక్షంలో బ్యాలెట్ బాక్స్ భద్రం అనంతరం సీల్ వేశారు.

నియోజకవర్గంలో దాదాపు 75 శాతం పోలింగ్ నమోదవ్వడంతో పాటు పెద్ద ఎత్తున ఓటర్లు హాజరవ్వడంతో రాజకీయ పార్టీలు నాయకులు పోలింగ్ సరళిని బట్టి లెక్కల్లో మునిగిపోయారు. ప్రధానంగా పోటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, జనసేన అభ్యర్థి పంతం నానాజీ మధ్య నెలకొంది. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల సంక్షేమ పాలనలో నవరత్న సంక్షేమ పథకాలతో పాటు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ, గృహ నిర్మాణాలు, వలంటీరుతో ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ, సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన పాలన అందించడంతో ప్రజలు స్వచ్ఛందంగా హాజరై ఓటు హక్కు వినియోగించుకుని తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని వైఎస్సార్ సీపీ భావిస్తోంది. అదే ధీమాతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉన్నాయి. గ్రామాల వారీగా పోలింగ్ సరళిని బట్టి లెక్కలు వేస్తూ మెజార్టీని లెక్కించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా కొన్ని రోజులుగా ఎన్నికల హడావుడితో బిజీ బిజీగా గడిపిన అభ్యర్థులు, వారి అనుచరులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు విశ్రాంతి తీసుకునే మార్గాల్లో నిమగ్నమయ్యారు. మరో వైపు జూన్ 4న ఫలితాలు వెల్లడి కానుండడంతో అప్పటి వరకు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సందట్లో సడేమియాలా ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి.

ఓటులోనూ అక్కచెల్లెమ్మలదే ఆధిక్యం

- కాకినాడ సిటీలో 72.17 శాతం ఓటింగ్
- 90,631 ఓట్లు మహిళామణులవే
- గత ఎన్నికల కన్నా 7 శాతం పెరుగుదల
- విజయంపై వైఎస్సార్ సీపీ పూర్తి ధీమా

కాకినాడ: ఓటు వినియోగంలో కూడా మహిళామణులే ఆధిక్యాన్ని ప్రదర్శించారు. 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో కాకినాడ సిటీ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో పురుషుల కన్నా మహిళలే ఉత్సాహంగా ఓటింగ్‌కు హాజరయ్యారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం మంగళవారం ఇందుకు సంబంధించిన లెక్కలు తేల్చారు. మొత్తం 2,41,620 మంది ఓటర్లకు గాను 1,74,366 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ప్రకారం కాకినాడ సిటీలో 72.17 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నట్లయ్యింది. 2019 ఎన్నికల్లో 65.30 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈసారి మరో 7 శాతం ఓట్ల పెరుగుదల కనిపించింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఏడాది ఉదయం 7 నుంచే ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇక కాకినాడ జగన్నాథపురం ఎంఎస్ఎన్ చార్టీస్ పోలింగ్ బూత్ వద్ద 88 శాతం ఓటింగ్ నమోదైతే అత్యల్పంగా పోలీస్ క్వార్టర్స్‌లోని పోలింగ్ స్టేషన్‌లో 39.01 శాతం నమోదైంది. ఇక మొత్తం పోలైన ఓట్లలో మహిళలు 90,631 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 83,675 మంది పురుషులు ఓటు వేశారు. ఇదిలా ఉండగా దుమ్ములపేట ప్రాంతంలోని ఓ పోలింగ్ కేంద్రంలో మాత్రం రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ఓటింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలం

ఓటింగ్ సరళి వైఎస్సార్ సీపీకి సానుకూలంగా కనిపించింది. అనేక సంక్షేమ పథకాల అమలు, పింఛన్‌దారులకు 1వ తేదీ ఉదయం ఆరు గంటలకే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేయడం, ఇళ్ల స్థలపట్టాలు, వాటికి రిజిస్ట్రేషన్లు, కాకినాడ నగరంలో చరిత్రలో ఎన్నడూలేనంతగా జరిగిన అభివృద్ధి ఇక్కడి ప్రజలను పార్టీకి సానుకూలంగా మలిచాయన్న అంచనా వేస్తున్నారు. ఆ మేరకు వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆయన అనుచరులు నగరంలోని అన్ని ప్రాంతాల్లో జరిగిన ఓటింగ్ సరళిని అధ్యయనం చేసి పార్టీకి సానుకూల వాతావరణం ఉందని చెబుతున్నారు. పోలింగ్ జరిగిన తీరు, ముఖ్యంగా పెద్ద ఎత్తున మహిళలు ఉత్సాహంగా పోలింగ్‌కు రావడం కూడా తమకు మరింత కలిసివచ్చే అంశంగా పేర్కొంటున్నారు. వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో పాటు ఇళ్ల స్థలాలను మహిళల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసిన తీరు, ఇతర అంశాలు తమ ప్రభుత్వ పనితీరును స్వాగతిస్తూ మహిళలు అనుకూలంగా ఓటు వేశారని అంచనాకు వచ్చారు. మొత్తం మీద ఈ ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్న లెక్కల్లో పార్టీ నేతలు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌కు సీలు వేస్తున్న సిబ్బంది

- పర్యవేక్షించిన అబ్జర్వర్, ఆర్వో
- రాజకీయ పార్టీల సమక్షంలో సీల్



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు గణేష్, ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గంలో పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. జేఎన్‌టీయూకే ఆవరణలోని సివిల్ బ్లాక్‌లో వీటిని భద్రపరిచారు. పటిష్టమైన భద్రతతో జరిగిన ఈవీఎంల తరలింపు కార్యక్రమాన్ని మంగళవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షించారు. కాకినాడ సిటీ పరిధిలోని 234 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లకు వచ్చిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించిన అనంతరం వారి సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు గణేష్, ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఈవీఎంలను తరలించిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ప్రతిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంలలో ఫలితాలు భద్రం

ఓటింగ్ పూర్తయిన అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌కు సీలు వేసి భద్రత ఏర్పాటు చేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి జేఎన్‌టీయూకే సివిల్‌బ్లాక్‌లో ఈ కేంద్రం ఏర్పాటైంది. సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో అక్కడ ఎన్నికల విభాగానికి చెందిన అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు.

దూషించి దాడి చేసినా అరెస్టు చేయరా?

- పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన వేములవాడ గ్రామస్తులు
- సర్పంచ్ భర్తపై జనసేన కార్యకర్త దాడిపై ఆగ్రహం
- సీఐ హామీతో ఆందోళన విరమించిన బాధితులు



కరప పోలీసు స్టేషన్ ఎదురుగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వేములవాడ గ్రామస్తులు, మహిళలు

కరప: జనసేన కార్యకర్తలపై కేసు నమోదు చేయలేదని పోలీసుల తీరును నిరసిస్తూ వేములవాడ గ్రామస్తులు మహిళలతో కలసి నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలం వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి భర్త శంకర్ సోమవారం సాయంత్రం ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు వెళ్లారు. అక్కడ జనసేన, వైఎస్సార్ సీపీ ఏజెంట్లు ఏదో విషయమై వాగ్వాదం చేసుకుంటుండగా శంకర్ కల్పించుకుని సర్దిచెప్పబోగా జనసేన ఏజెంట్ మీసాల రాంబాబు నువ్వెవరు చెప్పడానికని దుర్భాషలాడారు. దీంతో శంకర్ బయటకు వచ్చేశారు. అనంతరం శంకర్ తన స్నేహితులు వజ్రపు కామేశ్వరరావు, గున్నూరు రాజ్‌కుమార్, పాలిక సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి వీరబాబు, గంజా రాజులతో కలసి ఇంటికి వెళుతుండగా రాత్రి 7.30 గంటల సమయంలో బీసీవీధి రామాలయం వద్ద జనసేన కార్యకర్తలు శ్రీపాదం సాయిరాజు, పుణ్యమంతుల రామస్వామి, శ్రీపాదం సూర్యనారాయణ, గండి పట్టాభి, మరికొందరితో శంకర్‌ను దూషిస్తూ భౌతిక దాడికి పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఎస్సీ నాయకులను కూడా కులం పేరున దూషిస్తూ దౌర్జన్యానికి దిగారు. శంకర్‌కు కడుపులో నొప్పి వచ్చి, ఊపిరాడకపోవడంతో చికిత్సకోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి, వైద్యం చేయించారు. మంగళవారం సాయంత్రానికి కూడా నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయకపోవడంతో సర్పంచ్ మంగాదేవి, మాజీ ఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, పాలిక సూరిబాబు, రామకృష్ణ, విత్తనాల శ్రీను, గుత్తుల సత్తిబబు, దూడల శ్రీనివాస్ గ్రామస్తులు, మహిళలతో కల్సి కరప పోలీసుస్టేషన్‌కు వచ్చి నిందితులపై కేసు ఎందుకు పెట్టలేదు, ముద్దాయిలను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నిస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ టి.రామకృష్ణ బుధవారం ఉదయం 10 గంటలకల్లా నిందితుడిని పట్టుకుని తీసుకువస్తామని చెప్పినా ఆందోళనకారులు వినిపించుకోలేదు. ఇప్పుడే తీసుకురావాలంటూ భీష్మించారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐ కె.శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి ఇక్కడి పరిస్థితిని ఎస్ఐ వివరించారు. గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్, ఇతర స్టేషన్ల నుంచి పోలీసులు వచ్చి స్టేషన్ వద్ద మోహరించారు. సీఐ శ్రీనివాస్ వచ్చి, ఆందోళనకారులకు నచ్చచెప్పినా వినిపించుకోకుండా రాత్రి 10 గంటల వరకూ రాస్తారోకో కొనసాగించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు తదితర గ్రామ పెద్దలతో సీఐ మాట్లాడారు. శంకర్‌ను దౌర్జన్యంగా కొట్టినందుకు, ఎస్సీ నాయకులను కులం పేరుతో దూషించినందుకు నిందితులపై అట్రాసిటీ, ఇతర కేసులు నమోదుచేసి, అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం 10 గంటలకల్లా నిందితులపై కేసు నమోదు చేసి, కాకినాడ కోర్టుకు అప్పగిస్తామని సీఐ చెప్పడంతో ఆందోళనకారులు రాస్తారోకో విరమించారు. బుధవారం అరెస్ట్ చేయకపోతే గ్రామస్తులందరూ స్టేషన్‌లో బైఠాయిస్తామని చెప్పి వెళ్లిపోయారు.



వేములవాడ గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్



బాధితుడు శంకర్

మెట్ట చరిత్రపై మరుగేల!

- ఆక్రమణలకు గురవుతున్న చారిత్రక స్థలం
- చరిత్ర చెరిగిపోతున్నా పట్టించుకోని అధికారులు
- కొండ నుంచి రాజమండ్రి గోదావరి వరకు గుహ ఏర్పాటు
- పాండవుల మెట్టకు పెరుగుతున్న యాత్రికులు
- అభివృద్ధిని పట్టించుకోవాలని విన్నపం



పాండవుల మెట్ట ఎక్కేందుకు ఏర్పాటు చేసిన మెట్లు

సామర్లకోట: వేసవి కాలం కావడంతో సాయంత్రం సమయంలో యాత్రికులు, స్థానికులు పాండవుల మెట్టను సందర్శిస్తున్నారు. పాండవులు అజ్ఞాత వాసం చేసిన సమయంలో పెద్దాపురానికి సమీపంలో ఉన్న ఒక మెట్టపై పాండవులు నివసించినట్టు చరిత్ర చెప్తోంది. ఈ కారణంగానే ఈ మెట్టను పాండవుల మెట్టగా పిలుస్తారు. పాండవులకు సంబంధించి మహాభారతంలో ఒక చరిత్ర ఉంది. కౌరవుల చేతిలో పాండవులు జూదంలో ఓటమి చెందడంతో అజ్ఞాత వాసం చేయాల్సి వచ్చిన సమయంలో వారు పాండవుల మెట్టపై నివసించి రాజమహేంద్రవరంలోని కోటి లింగాల రేవు వరకు గుహ ఏర్పాటు చేశారు. నిత్యం గోదావరి స్నానం చేసి పూజాదికాలు నిర్వహించేవారని కథనాల ఉన్నాయి. ఈ మెట్టపై సూర్యనారాయణ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పాండవులు పూజలు చేసే వారని ప్రతీతి. నేటికీ రథ సప్తమికి ఇక్కడి సూర్య భగవానునికి ఉత్సవాలు, కల్యాణాలను, అన్నదానాన్ని అర్చకులుగా ఉన్న వై.అనంతలక్ష్మీ, ఎ. గీతావాణిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

కొండపై భీముడి గద ఉంచినట్లు, అక్కడ నిలబడడంతో ఆయన పాదాలు ఉన్నట్లు చెప్తారు. ఈ ప్రాంతంలో రాళ్లు ఒకదానిపై ఒకటి పేర్చి ఎన్ని రాళ్లు పేర్చితే అన్ని అంతస్తుల భవనం నిర్మాణం చేస్తామని నమ్మకం ఉంది. దాంతో ఆ ప్రదేశంలో రాళ్లను భక్తులు పేరుస్తారు. అలాగే భీముడి వంటశాలను అధికారులు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే కొండపై పోలీసు సబ్ స్టేషన్‌ను నిర్మించారు. అలాగే సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేశారు. సామర్లకోట రైతు శిక్షణా కేంద్రాన్ని ఈ మెట్టపైనే నిర్మించారు. ఇటీవల మూడు ఎకరాల స్థలాన్ని శతాబ్ది పార్కు పేరుతో రూ.మూడు కోట్లతో అభివృద్ధి చేశారు. భావితరాలకు ఇటువంటి చరిత్రలు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. దీనిలో భాగంగానే ప్రముఖ దేవాలయాలను పురావస్తుశాఖ స్వాధీనం చేసుకుంది. అదే విధంగా పెద్దాపురంలోని పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భావితరాలకు అందించాల్సి ఉంది.

గుహపై దృష్టి సారించాలి



పాండవుల మెట్టపై ఉన్న గుహపై పర్యాటక శాఖ అధికారులు దృష్టి పెట్టాలి. ఈ గుహలోనికి వెళ్లడానికి ప్రయత్నిస్తే గబ్బిలాల వాసన వస్తుంది. వందలాది సంవత్సరాలకు చెందిన గుహ వల్ల చాలా వరకు ఇది మూసుకుపోయింది. ఈ గుహలో లైట్లు ఏర్పాటు చేసి మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం చేయాలి. పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.


– కత్తుల రామ్మోహనరావు,
విద్యా సంస్థ అధినేత, పెద్దాపురం



మెట్టపై నిర్మించిన సూర్యనారాయణమూర్తి ఆలయం



పాండవులు ఏర్పాటు చేసుకున్న గుహ



భీముని వంట శాల